సాక్షి ఒడిశా

బుధవారం । 21 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,16,482లు వచ్చాయని అధికారులు తెలిపారు.



సిగ్నల్ జేఈని ప్రశ్నించిన సీబీఐ

-8లో



దర్శించుకున్న ప్రముఖులు

-9లో

న్యూస్‌రీల్

గమ్యం చేరని రథాలు..



భక్తజనంతో కదులుతున్న జగన్నాథుని నందిఘోష్ రథం


భువనేశ్వర్: జగన్నాథుని నందిఘోష్ రథం అర్థాంతరంగా నిలిచిపోయింది. అంతకుముందే బయల్దేరిన దేవీ సుభద్ర దర్పదళనం గుండిచా గమ్యానికి కొంచెం దూరంలో ఆగింది. తొలుత బయల్దేరిన బలభద్ర స్వామి తాళధ్వజం మాత్రమే సకాలంలో గమ్యం చేరింది. సూర్యాస్తమయం వరకు రథాలను నిరవధికంగా లాగి గుండిచా గమ్యం వైపు నడిపిస్తారు. సూర్యాస్తమయం సమయానికి చేరిన చోటులో రథాలు లాగడం ఆపేయడంతో అర్థాంతరంగా నిలిచిపోయాయి. జగన్నాథుని నందిఘోష్ రథం మౌసీ మా(పిన్నమ్మ) కూడలి ప్రాంతంలో నిలిచిపోయింది. తదుపరి యాత్ర బుధవారం ఉదయం ప్రాతఃకాల పూజాదులు ముగించాక చేపడతారు. అంతవరకు జరగాల్సిన పూజాదులను మూల విరాట్‌లకు నడిరోడ్డుపై నిలిచిన రథాలపై నిరాటంకంగా కొనసాగిస్తారు. ఈ వ్యవధిలో రథాలపై దేవుళ్లను దర్శించుకోవడంలో ఎటువంటి ఆంక్షలు విధించరు.

తాళధ్వజం.. కుతూహలం..



స్వామి రాక కోసం ఎదురు చేసిన భక్తుల నిరీక్షణకు తెరపడింది. జగన్నాథుని అన్న బలభద్ర స్వామి పయనించే తాళధ్వజం తొలుత కదలడంతో భక్తజనం ఉప్పొంగిపోయింది. అకస్మాతుగా పేరుకుపోయి ఉన్న జనంలో కదలిక చోటు చేసుకోవడంతో తేలికపాటి తోపులాట జరిగిన ముప్పు లేకుండా పోయింది. ఎండ వేడిమి లెక్క చేయకుండా రథం లాగేందుకు నడుం బిగించిన భక్తజనం వడదెబ్బకు గురికాకుండా అగ్నిమాపక దళం దారి పొడవునా చన్నీటి సించనం నిరవధికంగా కొనసాగించింది.

టెంకాయల సైకతశిల్పం



ప్రపంచ ప్రసిద్ధ జగన్నాథుని రథయాత్ర పురస్కరించుకుని ప్రముఖ సైకతశిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ కళాత్మకత చాటుకున్నారు. యాత్ర సందర్భంగా స్థానిక సాగర తీరంలో 250 సహజ టెంకాయలను వినియోగించి ఈ సువిశాల సైకత శిల్పాన్ని తీర్చిదిద్దాడు. యాత్ర సమగ్ర సారాంశం ఈ శిల్పంలో ప్రతిబింబించడం విశేషం. మూల విరాట్‌ల 3 రథాలను ఈ శిల్పంలో ప్రదర్శించారు.

తోపులాటతో అస్వస్థత



పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

భువనేశ్వర్: జగన్నాథుని రథయాత్రలో విపరీతమైన జనసందోహం మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ పరిస్థితుల్లో ఉక్కిరి బిక్కిరైన జనం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ప్రధానంగా బలభద్రుని రథం తాళధ్వజం కదిలే సమయంలో స్థానిక మారీచ్‌కోట్ కూడలి వద్ద ఇటువంటి పరిస్థితి చోటు చేసుకుంది. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ఏడుగురు యాత్రికులు అస్వస్థతకు గురయ్యారు. వీరందరినీ ఆస్పత్రిలో చేర్చి, సత్వర చికిత్స చేయడంతో కోలుకున్నారు.







రథాల పైకి మూల విరాట్‌ల ఆగమనంతో భక్తజనంతో కిక్కిరిసిన శ్రీమందిరం ప్రాంగణం (ఇన్‌సెట్లో) బలభద్రుడు, జగన్నాథుడు, దేవీ సుభద్ర పాహండి



పూరీ తీరం.. భక్తజన సంద్రం



శ్రీమందిరం పుష్ప శోయగం

పక్షం రోజులు అస్వస్థతతో తెరమరుగు సేవలతో కోలుకున్న జగన్నాథుడు.. జన్మ వేదికకు తోబుట్టువులతో కలిసి యాత్రకు బయల్దేరాడు. తమ వద్దకు వస్తోన్న స్వామివారికి జనం ఎదురేగి స్వాగతం పలికారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా లక్షలాది మంది భక్తులు గుండిచా మందిరం ఆవరణ వరకు బారులుతీరి, తన్మయత్వంలో మునిగితేలారు. ఈ మేరకు పూరీ పట్టణం.. భక్తజన సంద్రంగా మారింది. శ్రీమందిరం ఆలయం సమగ్రంగా పుష్ప శోయగంతో గుభాళించింది. – భువనేశ్వర్

- భక్తిశ్రద్ధలతో పూరీ జగన్నాథుని రథయాత్ర
- తండోప తండాలుగా తరలివచ్చిన భక్తులు
- ఉదయం 8.30 గంటలకే పాహండి ప్రారంభం
- ముందుగా బలభద్రుడు.. వెంటే తరలిన సుభద్ర, జగన్నాథుడు



రథ శిఖరంపై కలశాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

రథయాత్రలో పాహండి భారీ ఘట్టం. శ్రీమందిరం రత్నవేదిక ప్రాంగణం నుంచి అత్యంత బరువైన దారు మూల విరాట్‌లను ఎంతో ప్రయాసతో సురక్షితంగా తరలించి రథాలపైకి చేర్చడమే ఈ ఘట్టం. వరుస క్రమంలో తరలించే ఈ ప్రక్రియను గొట్టి పాహండిగా పేర్కొంటారు. తొలుత సుదర్శనుడు తరలివచ్చి, దేవీ సుభద్ర రథంపై ఆసీనుడయ్యాడు. వెంటే బలభద్రుడు, తదుపరి దేవీ సుభద్ర, చివరగా జగన్నాథుని పాహండి నిర్వహించారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ.. మధ్యాహ్నం 12.05 గంటల వరకు నిరవధికంగా సాగింది. ప్రధాన ఆలయం నుంచి 7 మెట్ల ప్రాంగణానికి మూల విరాట్‌లు చేరడంతో ప్రత్యేక శోభిత మకుటాలు(టయ్యా) అమర్చి 22 మెట్లు మీదుగా సింహద్వారం నుంచి వెలుపలకు మూల విరాట్‌లు తరలించేందుకు పాహండి నిర్వహించారు.

అగణిత భక్త జనమయం..

జగన్నాథుని యాత్రలో రథాలు అత్యంత కీలకం. తయారీ మొదలుకొని మూల విరాట్‌ల యాత్ర రాకపోకలను సురక్షితంగా నిర్వహించడంలో వీటి పాత్ర అనన్యం. ఈ నేపథ్యంలో అడుగడుగున స్వామి అనుగ్రహం, ఆజ్ఞతో ప్రతి దశ పనులను ఆచితూచి నిర్వహిస్తారు. ఇదే క్రమంలో రథయాత్ర రోజున ముందుగా రథ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తారు. మూల విరాట్‌లు రథారూఢం చేయడానికి ముందుగా ఈ మహోత్సవం నిర్వహిస్తారు. యాత్ర ఆద్యంతాలు నిర్విఘ్నంగా జరగాలనే ఆకాంక్షతో స్వామి ఆజ్ఞ, అనుగ్రహం కటాక్షానికి సంకేతంగా ఆజ్ఞా మాలలను పొంది, ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ఆజ్ఞామాలను రథ శిఖరంపై ప్రతిష్ఠించిన ఇత్తడి కలశానికి అలంకరించి పతాకం అమర్చడంతో రథాలు యాత్రకు సిద్ధమైనట్లు పరిగణించి పాహండి చేపట్టారు.

రథ వాకిలి కళామయం..

భగవంతుని అనుగ్రహం కోసం భిన్నాతిభిన్నమైన రీతుల్లో భక్తులు మదినిండా నెలకొని ఉన్న భావోద్వేగాలను ప్రదర్శిస్తున్నారు. స్వామి రాక కోసం నిరీక్షిస్తున్న యాత్ర రథాల వాకిలిలో కళా హృదయులు స్వామి అనుగ్రహం తమదైన రీతిలో కళాత్మకత ప్రదర్శించారు.



రథ ప్రతిష్ఠ పూజలకు బయల్దేరిన సేవాయత్‌లు



గుండిచా మందిరం వాకిలి కడిగి శుభ్రం చేస్తున్న భక్తులు



కనువిందు చేసిన మయూర నృత్యం

జగన్నాథుని యాత్రలో భక్తి భావోద్వేగం పలు రకాల్లో సాక్షాత్కరించడం విశేషం. ఆబాల గోపాలం తారతమ్యం లేకుండా అన్ని వర్గాల ప్రజలు స్వామి పట్ల భక్తిని ఊహాతీతమైన రీతుల్లో ప్రదర్శిస్తుంటారు. వీరి హావభావాల్లో భక్తిభావం కొట్టొచ్చినట్లు తారసపడుతుంది. కటక్ జిల్లా బంకి ప్రాంతం నుంచి విచ్చేసిన సుదీప్తకుమార్ ప్రధాన్ జగన్నాథుడు, హనుమంతుని పరమ భక్తునిగా పేర్కొన్నాడు. ఏటాయాత్రలో క్రమం తప్పకుండా పాల్గొని రథాలు నడిచే బొడొదండొ మార్గంలో హనుమంతుని వేషధారణలో భజనలు, సంకీర్తనలకు అనుగుణంగా గంతులు వేస్తు భక్తి తత్పరత చాటుకున్నాడు. యాత్రకు విచ్చేసిన వారి దృష్టిని విశేషంగా ఆకట్టుకున్నాడు.



హనుమంతుని వేషధారి విజృంభణ

● కనుచూపు మేరలో..


శ్రీక్షేత్రంలో జగన్నాథుని రథయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. ఊహించిన రీతిలో అగణిత జనం మధ్య జగన్నాథుని నందిఘోష్ రథం కదిలింది. ఈ ఘడియల కోసం నిరీక్షించిన భక్తజనం పులకిత మేనుతో రథాన్ని వడివడిగా లాగడంలో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు. నిర్ధారిత వేళ కంటే ముందుగానే ఉత్సవ సన్నాహాలు చేపట్టి, మూల విరాట్‌లను యాత్రకు సిద్ధం చేయడంలో దైతపతులు ఇతర వర్గాలు సేవాయత్‌లు చురుకుదనం ప్రదర్శించారు. ప్రధాన ఆలయం నుంచి స్వామివార్లను ముందస్తుగా తరలి రావడంతో రథాలు లాగే ప్రక్రియ సకాలంలో ప్రారంభమైంది. సోమవారం అర్ధ రాత్రి నుంచి దైతపతులు గర్భ గుడిలోకి ప్రవేశించి, స్వామి యాత్రకు కావాల్సిన ఉపచారాలు చేపట్టారు. మూలవిరాట్ సురక్షితంగా బయటకు వచ్చి, తిరిగి గుండిచా మందిరం అడపా మండపంపై ఆసీనులయ్యేంత వరకు దైతపతులు కంటికి రెప్పలా స్వామిని కాపాడుకుంటారు. ఈ క్రమంలో మూల విరాట్‌లకు బాహుట కొయ్య, సేనాపట్ల అమరిక తదితర పకడ్బందీ చర్యల్ని కట్టుదిట్టంగా చేపట్టారు.



జనం మధ్య గుండిచా యాత్రలో ముందుకు సాగుతున్న దేవతామూర్తుల రథాలు



సుదర్శనుడి పాహండి



చిన్నారుల గొట్టి పువా నృత్య భంగిమ

● ఛెరా పొహొరా..

జగన్నాథుని తొలి సేవకుడు పూరీ గజపతి మహారాజా దివ్య సింఘ్‌దేవ్. యాత్ర కోసం మూల విరాట్లు రథాలపై ఆసీనులు కావడంతో మహారాజా ప్రత్యక్షమయ్యారు. రాజనగరి నుంచి సింహద్వారం ఆవరణలో నెలకొన్న రథ ప్రాంగణానికి తరలివచ్చారు. బంగారు పిడి కలిగిన చీపురుతో 3 రథాలను ఊడ్చి, సుభాషిత జలం చిమ్మి శుద్ధి ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనడం ఆచారం. ఈ సేవని ఛెరా పొహొరాగా పేర్కొంటారు. మధ్యాహ్నం 2.45 గంటల నుంచి సుమారు 3 గంటల వరకు ఈ సేవలో మహారాజా ప్రత్యక్షంగా పాల్గొన్నారు. పూర్వకాలంలో యాత్ర కొనసాగే బొడొదండొ దారి పొడవునా శ్రీమందిరం సింహద్వారం నుంచి గుండిచా మందిరం ఆవరణ వరకు మహారాజా ఈ సేవలో పాల్గొన్నట్లు కథనం. ఈ సేవ ముగియడంతో మూల విరాట్‌ల పాహండి కోసం ఏర్పాటు చేసిన చారుమళ్లు తొలగించి రథాలకు కొయ్య గుర్రాలను అమర్చారు. అనంతరం రథాలు లాగడం ప్రారంభించారు.



రథంపై చీపురుతో శుభ్రం చేస్తున్న గజపతి మహారాజా దివ్యసింఘ్ దేవ్

క్లుప్తంగా

డీసెట్‌లో నిఖితకు7వ ర్యాంకు


నిఖిత

నరసన్నపేట: మండలంలో జమ్ము గ్రామానికి చెందిన చల్ల నిఖిత ఏపీ డీఈఈ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు సాధించింది. డిప్లమా ఎడ్యుకేషన్ ఎంట్రన్స్ పరీక్షలో గణిత విభాగంలో 65 మార్కులతో ఈమె ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా గ్రామస్తులు నిఖితను అభినందించారు.

సజావుగా ఈసెట్


శివానీ కాలేజీలో హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ రెండో ఏడాది ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఈసెట్–2023 ప్రవేశ పరీక్ష మంగళవారం జిల్లాలో మూడు కేంద్రాల్లో నిర్వహించారు. పాలిటెక్నిక్ డిప్లమో, డిగ్రీ ఎంపీసీ స్ట్రీం పూర్తి చేసి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. చిలకపాలెం శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మొదటి షిఫ్టులో 189 మందికి 181 మంది, రెండో షిఫ్టులో 189 మందికి 183 మంది, ఎచ్చెర్ల శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 185 మందికి 181 మంది, రెండో షిఫ్టులో 186 మందికి 180 మంది, టెక్కలి ఐతంలో మొదటి షిఫ్టులో 130 మందికి 126 మంది, రెండో షిఫ్టులో 130 మందికి 129 మంది హాజరయ్యారు.

కూర్మనాథుని సన్నిధిలో ఉడిపి పీఠాధిపతి


కూర్మనాథాలయంలో విశ్వావల్లభ తీర్థ స్వామీజీ

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని ఉడిపికి చెందిన షోదే శ్రీవాది రాజమఠం పీఠాధిపతి విశ్వావల్లభ తీర్థ స్వామీజీ శిష్యబృందంతో కలిసి దర్శించుకున్నారు. మంగళవారం విచ్చేసిన స్వామీజీకి ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు మూల విరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం అనుగ్రహభాషణం చేశారు. ఆయన వెంట జబర్దస్త్ ఫేం హరికృష్ణ ఉన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

జి.సిగడాం: జిల్లా వ్యాప్తింగా రేషన్ డిపోల డీలర్ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా రేషన్ డిపోల సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి రవి కుమార్ కోరారు. మంగళవారం జి.సిగడాం–పొందూరు మండలాలకు చెందిన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 23న విజయవాడ వెళ్లి అక్కడ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి డీలర్ల సమస్యను వివరిస్తామన్నారు. మండలాల్లో ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సరుకులను తూకం వేయకుండా డిపోలకు బియ్యం పంపిణీ చేస్తున్నారని, ప్రతి 50 కేజీల బస్తాలో సుమారు అరకేజీ తక్కువ వస్తుందని చెప్పారు. ఇటువంటి వాటికి చెక్ పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు చిట్టి రామ్మూర్తి, సత్తిబాబు, జిల్లా కార్యదర్శి బి.భాస్కరరావు, డివిజనల్ అధ్యక్షుడు గంగు శిమ్మినాయుడు, పొందూరు మండల శాఖ అధ్యక్షుడు సింహాచలం, జి.సిగడాం మండల శాఖ అధ్యక్షుడు నక్క రవికుమార్, చిత్తిరి మోహన్, అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన వ్యాన్

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌కు చెందిన డ్రైవర్ ఎస్.కె.ఫజిలినాథ్, క్లీనర్ షేక్‌రాజ్‌లు విశాఖపట్నం వైపు వ్యాన్‌తో వస్తుండగా కె.కొత్తూరు జాతీయ రహదారిపై ముందు వెలుతున్న లారీని బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లారీలో ఇరుక్కున్న ఇరువురిని స్థానికులు బయటకు తీసి హైవే అంబులెన్స్ సహాయంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. టెక్కలి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బరంపురం: రథాలపై పూజలందుకుంటున్న దేవతామూర్తులు


పర్లాకిమిడి: తొలిపూజ చేస్తున్న యువరాణి


మల్కన్‌గిరి: తొలిపూజ చేస్తున్న కలెక్టర్ విశాల్‌సింగ్


రాయగడ: హరేరామ సంకీర్తనలు


రాయగడ: రథాన్ని లాగుతున్న ఎంపీ, ఎస్పీ, ప్రముఖులు


రాయగడ: రథంపై కొలువైన దేవతామూర్తులు


కొరాపుట్: శబరి శ్రీక్షేత్ర రథాయాత్రలో గిరిజనులు

జగదానంద కారకా..



పర్లాకిమిడి: రథయాత్రకు విచ్చేసిన అశేష జనవాహిని

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా రథయాత్ర
- ఉత్సాహంగా ముందుకు కదిలిన జనవాహిని

బరంపురం: నగరంలోని వివిధ కూడళ్లలో రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. గుసాని నువాగాం ఉత్తరేశ్వర్ ఆలయ ప్రాంగణంలోని జగన్నాథ మందిరం నుంచి చేపట్టిన యాత్రలో దేవతామూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. వేద మంత్రాలు, సన్నాయి రాగాలు, జయగంట ధ్వనులు, భక్తుల సంప్రదాయ ఊలాలతో ఈ కార్యక్రమం సందడిగా సాగింది. అలాగే స్థానిక మిలటరీ లైన్, కోర్టుపేట జంక్షన్, పెద్దబజార్, ఉత్కళ ఆశ్రమ రోడ్డు, పాతలేశ్వర్ ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న జగన్నాథ ఆలయ ప్రాంగణాల్లో రథయాత్ర చేపట్టారు.

ఆకట్టుకుంటున్న కళాకృతులు

శ్రీక్షేత్ర రథయాత్ర సందర్భంగా పట్టణంలోని అంబపువా మారుతీనగర్ 2వ లైన్‌లో నివాసం ఉంటున్న ఇంజినీరింగ్ విద్యార్థిని మానసికుమారి పండా తన కళా నైపుణ్యంతో జగన్నాథుని కళాకృతులు తూర్చిద్ది, ఆకట్టుకున్నారు. 2022లో వివిధ రకాలు వస్తువులతో జగన్నాథుని చిత్రాలు తయారు చేసి, నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించిన ఆమె.. అదే సంప్రదాయాన్ని కొనసాగించి, అందరి మన్ననలు పొందారు.

ఉత్సాహ పరిచిన ఎమ్మెల్యే..

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని బొరిగుమ్మలో జరిగిన రథయాత్రలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పాల్గొన్నారు. అశేష భక్తజనం మధ్య తాను కూడా ఓ సాధారణ భక్తుడిలా రథం లాగుతూ అందరినీ ఉత్సాహ పరిచారు.

క్షేమంగా గుండిచా మందిరాలకు..

కొరాపుట్: రథాయాత్రలో భాగంగా రథాలు గుండిచా మందిరాలకు క్షేమంగా చేరుకున్నాయి. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని శబరి శ్రీక్షేత్రంలో గిరిజన సంప్రదాయ పద్ధతిలో సవర తెగకు చెందిన వారు యాత్రను ముందుండి నడిపించారు. వాతావరణం అనుకూలించడంతో అంతా పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జగన్నాథ, బలభద్ర రథాలను మగవారు ముందుకు కదిలించగా.. మహిళలు సుభద్రా రథాన్ని లాగారు. కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్ హాజరై, భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. నవరంగ్‌పూర్‌లో ఉదయం నుంచే పోలీసు ఆంక్షలు కొనసాగాయి. యాత్ర సాయంత్రం జరగాల్సి ఉండగా తెల్లవారు నుంచే అన్ని వీధుల వద్ద బారికేడ్లు పెట్టి నిలువరించారు. చిరు వ్యాపారులను కూడా అనుమతించలేదు. దీంతో దేవతా విగ్రహాలు రథాలు ఎక్కించే పాహండి కార్యక్రమం వెలవెలపోయింది. భక్తులు లేక కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించింది. దీనిపై స్థానికులు ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మాఝికి ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకుడు గౌరీశంకర్ మాఝి సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. అనంతరం కొన్నిచోట్ల చిరు వ్యాపారులను అనుమతించారు. రథయాత్రలో కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా, ఎస్పీ ఎస్.సుశ్రీ, ప్రదీప్ మాఝి, ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్ పాల్గొన్నారు.

రాయగడలో రథయాత్ర..

రాయగడ: జిల్లా కేంద్రమైన రాయగడలో రథయాత్ర ఘనంగా జరిగింది. మధ్యాహ్నం 2గంటల సమయంలో దేవతామూర్తులను పాహండితో రథాన్ని ఎక్కించారు. ఎస్పీ వివేకానంద శర్మ, కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక దంపతులు, పట్టణ ప్రముఖులు రథాన్ని లాగే కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో రథం గుండిచా మందిరానికి చేరుకుంది. సంకీర్తనలు, నృత్యాలు మేళతాళాలతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గుణుపూర్‌లో రథయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈసారి భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో స్వచ్ఛంద సేవాసంస్థలు అడుగడుగునా తాగునీటి సౌకర్యాలు, మజ్జిగ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

విక్రయాల సందడి..

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో రథయాత్ర ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ విశాల్‌సింగ్ రథంపై తొలి పూజలు చేశారు. వేద పండితులు వినాయక శత్పతి పర్యవేక్షణలో రథాలు లాగారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. యాత్రలో పిండివంటలు, ఆట వస్తువుల విక్రయాలతో సందడి వాతావరణం నెలకొంది.

వేర్వేరు రథాలపై..

పర్లాకిమిడి: గజపతి జిల్లా కేంద్రం పర్లాకిమిడిలో జగన్నాథ యాత్ర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. దేవతామూర్తులు జగన్నాథ, బలరామ, సుభద్రదేవి లను వేర్వేరుగా మూడు రథాలపైకి భక్తులు, సేవాయత్‌లు తరలించారు. గజపతి రాజుల వంశీయురాలు కల్యాణీదేవి గజపతి రథాలను బంగారు చీపురుతో శుభ్రం చేశారు. అనంతరం జగన్నాథునికి సంప్రదాయంగా పూజలు జరిపి, పట్టువస్త్రాలు సమర్పించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్ ఆదేశాల మేరకు రథాలు గుండిచా మందిరం వైపు పయనమయ్యాయి. రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ బిజయ పట్నాయక్, బీజేడీ సీనియర్ నాయకులు డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి, రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ నాయక్, యువజన నాయకులు శాసనం లింగరాజు, రూపేష్ పాణిగ్రాహి, కార్యవర్గ సభ్యులు సిద్ధేశ్వర మిశ్రాలు తదితరులు పాల్గొన్నారు. ఎస్‌డీపీఓ రామకృష్ణ పతి పర్యవేక్షణలో ఆదర్శ పోలీసు స్టేషన్ ఐఐసీ బబులీ నాయక్, ఎక్సైజ్, అగ్నిమాపక దళం సిబ్బంది శాంతి భద్రతలను పరిరక్షించారు.


పర్లాకిమిడి: రథంపై బంగారు చీపురుతో శుభ్రం చేస్తున్న యువరాణి కల్యాణీదేవి గజపతి


కొరాపుట్: నవరంగ్‌పూర్‌లో ఎస్పీ ఎస్.సుశ్రీ, ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్ దంపతులు


బరంపురం: మానసికుమారి పండా రూపొందించిన జగన్నాథుని కళాకృతులు


జయపురం: రథాన్ని లాగుతూ ప్రజలను ఉత్సాహ పరుస్తున్న ఎమ్మెల్యే


బరంపురం: రథయాత్రలో జయగంట ధ్వానులతో కళాకారులు


కొరాపుట్: రథాయాత్రలో ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మాఝి

సిగ్నల్ జేఈని ప్రశ్నించిన సీబీఐ

- బహనాగా బజార్ రైల్వేస్టేషన్ దుర్ఘటనపై కొనసాగిన విచారణ

భువనేశ్వర్: బాలసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వే స్టేషన్ వద్ద ఈనెల 2న జరిగిన ఘోర రైలు ప్రమాదంపై సీబీఐ అధికార బృందం దర్యాప్తు కొనసాగించింది. సొరొ సెక్షన్ సిగ్నల్ జూనియర్ ఇంజినీర్(జేఈ)గా ఉన్న అమీర్ ఖాన్‌ను మంగళవారం విచారించింద. సొరొ కమర్‌పూర్ అన్నపూర్ణ రైస్‌మిల్ సమీపంలో అద్దెకు తీసుకున్న ఇంట్లో దాదాపు 7గంటలు నిరవధికంగా ప్రశ్నించింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీబీఐ బృందం సోమవారం ఖాన్ అద్దె ఇంటిని సీల్ చేసింది. ఇంటిపై నిఘా ఉంచేందుకు సొరొ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు సిబ్బందిని నియమించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు, ఖాన్‌తో పాటు ఆయన ఇంటికి చేరుకుని క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. విచారణ అనంతరం జేఈని కస్టడీలోకి తీసుకున్నారు. ఇప్పటి వరకు స్టేషన్ మేనేజర్‌తో సహా రైల్వేలోని 12మంది అధికారులు, ఉద్యోగులను పలుమార్లు విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. ప్రమాదం మానవ కల్పితమా లేక సాంకేతిక వైఫల్యంతో జరిగిందా అనే కోణంలో లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో సాంకేతిక నిపుణులను కూడా నియమించారు. ఏజెన్సీ అనేక సాంకేతిక పరికరాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు స్టేషన్ ప్యానెల్ బోర్డు, రిలే గది సిగ్నల్ గదిని సీల్ చేశారు. ఆగ్నేయ రైల్వే మంగళవారం తమ సిబ్బంది ఎవరూ తప్పిపోలేదని లేదా పరారీలో లేరని, ఒడిశాలో ట్రిపుల్ రైలు ప్రమాదంపై దర్యాప్తులో అందరూ సీబీఐకి విచారణలో సహకరిస్తున్నారని స్పష్టం చేసింది.

మినీ వ్యాన్ బోల్తా

- 15మందికి గాయాలు
- రథాయాత్రను చూసేందుకు వస్తుండగా ప్రమాదం


బోల్తాపడిన వ్యాన్


క్షతగాత్రులు దయానిధి మాఝి

రాయగడ: కొరాపుట్ జిల్లాలోని లక్ష్మీపూర్ నుంచి రథాయాత్రకు చూసేందుకు పికప్ వ్యాన్‌లో రాయగడకు వస్తుండగా హలువా పంచాయతీ లోని తోలాసంకేశు వద్ద మినీ వ్యాన్ బోల్తాపడింది. ప్రమాదంలో 15మంది గాయాల పాలవ్వగా.. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల్లో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే... లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన 10మంది రాయగడలో జరగనున్న రథాయాత్రను చూసేందుకు మంగళవారం ఉదయం పికప్ వ్యాన్‌లో బయలుదేరారు. రఫ్‌కోన కూడలి వద్ద అదే వ్యాన్‌లో మరో ఐదుగురు ఎక్కారు. రాయగడకు సుమారు 7కిలోమీటర్ల దూరం ఉండగా వాహనం అదుపుతప్పి, బోల్తా పడింది. ప్రమాదంలో రొమి మండంగి(18), లక్ష్మీ నాయక్(25), రాధా మండంగి(13), సిమియా శరత్(23), దునాయి సరక(8), ఏషా సరక(12), సొధామిని మాఝి(23), రైతో మాఝి (21), దయానిధి మాఝి(18) మరికొందరు ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- గేటు వేయలేదని గుర్తించి ఆగిన గూడ్స్ రైలు

టెక్కలి రూరల్: విశాఖపట్నం నుంచి భువనేశ్వర్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలుకు టెక్కలి మండలం నౌపడ ఆర్ఎస్ రైల్వే గేటు వద్ద పెనుప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గూడ్స్ రైలు విశాఖపట్నం నుంచి నౌపడా మీదుగా భువనేశ్వర్ వైపు వెళ్తుండగా ఆ సమాచారం తెలియని గేట్‌మ్యాన్ గేటు వెయలేదు. ఈ విషయాన్ని గుర్తించిన గూడ్స్ డ్రైవర్ రైలు వేగాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు. హారన్ వేయడంతో అప్రమత్తమైన గేట్ మ్యాన్ హుటాహుటిన గేటు వేశారు. దీంతో రైలు అక్కడి నుంచి వెళ్లింది. గూడ్స్ డ్రైవర్ గుర్తించకపోతే పెనుప్రమాదం జరిగి ఉండేదని వాహనదారులు చెబుతున్నారు.


నౌపడ వద్ద గూడ్స్‌రైలు

ఘనంగా భక్తకవి గోపాలకృష్ణ జయంతి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్‌పర్సన్ నిర్మలాశెఠి


వేదికపై ఏడీఎం బీరేంద్రకుమార్ దాస్, అతిథులు

పర్లాకిమిడి: కవి, కలహంస గోపాలకృష్ణ పట్నాయక్ జయంతి ఉత్సవాన్ని స్థానిక టౌన్ హాలులో పురపాలక అధ్యక్షురాలు నిర్మలాశెఠి, మహంత రామానంద్ దాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కవి గోపాలకృష్ణ పట్నాయక్ చిత్ర పటానికి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భక్తకవి గోపాలకృష్ణ రచనలు, జగన్నాథునిపై చేసిన రచనలు ఒడిశా వాసులకు అమితానంద పరవశులుగా చేశాయని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీరేంద్రకుమార్ దాస్, డిప్యూటీ కలెక్టర్ జ్ఞాన రంజన్ మాఝి, హృషీకేష్ పండా, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, మున్సిపల్ ఈఓ వనమాలి శత్పతి, సంగీత దర్శకులు రఘునాథ పాత్రో తదితరులు పాల్గొని మాట్లాడారు. భక్తి సంగీత సంసద్ ఆధ్వర్యంలో జరిగిన గోపాలకృష్ణ పట్నాయక్ పలు రచనలు చదివి ఆలపించారు.

క్లుప్తంగా

మలేరియా జిల్లా అధికారి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన గంటా వెంకటరమణ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారిగా గంటా వెంకటరమణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మన్యం జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు జిల్లా మలేరియా అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వ్యాధుల నిర్మూలనకు కృషి చేస్తానని తెలిపారు.

24న జిల్లా స్థాయి ఎంపికలు

- సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్

విజయనగరం: రాష్ట్రంలోని కడపజిల్లాలో గల డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 4,5 తరగతుల్లో ప్రవేశాలకు ఈనెల 24న జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ మంగళవారం తెలిపారు. ఆ రోజు జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడామైదానంలో జరిగే ఎంపిక పోటీల్లో మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను త్వరలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి ఎంపికలకు పంపించనున్నట్లు చెప్పారు.

163 మద్యం బాటిల్స్ స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

మెంటాడ: మండలంలోని రాబంద, మీసాల పేట గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్న 163 మద్యం సీసాలను కొంపంగి వంతెన వద్ద పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఆండ్ర ఎస్సై సిద్ధార్థ మంగళవారం తెలిపారు. ఈ ప్రాంతంలో అక్రమంగా మద్యం తరలిస్తారని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు మాటువేసి పట్టుకున్నామని చెప్పారు. ఈ మేరకు పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదుచేశామన్నారు.

కోనాడలో 10 మద్యం సీసాలు..

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ గ్రామంలో అనధికారంగా 10 మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు భోగాపురం ఎక్సైజ్ ఎస్సై బి.రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన గుర్రాల పోలయ్య దగ్గర నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనధికారంగా బెల్టుషాపు నిర్వహించడంతో అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కొత్తపేట నీళ్లట్యాంక్ సమీపంలో నివాసం ఉంటున్న కె.లక్ష్మణరావు (26) మంగళవారం రాత్రి బజాజ్ షోరూమ్ వద్ద ఎడ్లబండికి ఉరేసుకున్నాడు. లక్ష్మణరావు రెండేళ్లుగా భార్యకు దూరంగా ఉంటున్నాడు. కుటుంబ కలహాలు, మనస్పర్థల నేపథ్యంలో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.


ఆత్మహత్యకు పాల్పడిన లక్ష్మణరావు

జాబ్ మేళాకు విశేష స్పందన

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్


యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. వైఎస్‌కే ఇన్ఫోటెక్, వారాహ ప్రతినిధుల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించామని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు 103 మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరు కాగా వారిలో 37 మంది ఎంపికైనట్లు తెలిపారు. పార్వతీపురం ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఇప్పటివరకు 7 జాబ్ మేళాలు నిర్వహించామని కళాశాల తరఫున సహాయ సహకారాలు అందించిన ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఐపీ సీతారాం, ఎల్‌డీఎం శ్రీమూర్తి, నైపుణ్యాభివృద్ధిశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దర్శించుకున్న ప్రముఖులు..

భువనేశ్వర్: జగన్నాథుని రథయాత్రను రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రత్యక్షంగా తిలకించారు. ప్రపంచ వ్యాప్తంగా సుఖశాంతులు ప్రసాదించాలని దేవదేవుని ప్రార్థించినట్లు గవర్నర్ తెలిపారు. యాత్రలో భాగంగా పాలుపంచుకుని జగన్నాథుని రథం తాడు లాగి పునీతమైనట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్నాథుని రథయాత్ర ఉత్కళ ప్రసంగ్, ఒడిశా రివ్యూ సంచికలను రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ ఎస్.మురళీధర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలిసి ఆవిష్కరించారు.

యాత్ర సాగిందిలా..

- సోమవారం రాత్రి 11.45 గంటలకు దైతపతులు శ్రీమందిరం ప్రధాన ఆలయం లోపలికి ప్రవేశించి, అర్ధరాత్రి 12 గంటలయ్యే సరికి బాహుట కొయ్యను అమర్చారు.
- అప్పటి నుంచి మంగళవారం ఉదయం 5.20 గంటల వరకు సేనాపట్ట అమరిక పనులు కొనసాగించారు. వీటి అమరిక మూల విరాట్‌ల తరలింపులో పటిష్టమైన పాత్ర పోషిస్తుంది.
- ఈ ప్రక్రియ ముగియడంతో యాత్రకు సిద్ధమైన మూర్తులకు ఉదయం 5.50 గంటలకు మంగళ హారతి సమర్పించి, దైతపతులు గర్భాలయం నుంచి నిష్క్రమించారు.
- గోప్య కార్యకలాపాలు ముగియడంతో శ్రీమందిరం ఆరుబయట బొడొ దండొలో యాత్ర సంబంధిత పనులు ఊపందుకున్నాయి.
- రథ ప్రతిష్ఠ పూజలు ముగించడంతో రథాలపైకి మూల విరాట్‌లు తరలించే పొహండి కార్యక్రమం ఉదయం 8.30 గంటలకు ప్రారంభించారు.
- చతుర్ధామూర్తుల తరలింపు మధ్యాహ్నం 12.05 గంటల వరకు నిరవధికంగా కొనసాగింది.
- ఉత్సవ మూర్తులను మూల విరాట్‌ల చెంతకు చేర్చి, శ్రీ జగన్నాథునికి మధ్యాహ్నం 12.40 గంటలకు చిత్తా(నుదుటి ఆభరణం) అలంకరించారు.
- యాత్ర రథాల్లో దేవతా మూర్తులు ఆసీనులైన కబురు అందడంతో పూరీ గజపతి మహారాజా పల్లకిలో చేరుకొని, బంగారు పిడి చీపురుతో 3 రథాలను ఊడ్చి శుచి, శుభ్రత కార్యకలాపాలను సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. అంతకు ముందు రథాలపై దేవుళ్లని స్థానిక గోవర్ధన పీఠాధిపతి స్వామి నిశ్చలానంద సరస్వతి దర్శించుకున్నారు.
- మహారాజా సేవ ముగియడంతో రథాలకు కొయ్య గుర్రాలను అమర్చి చారుమళ్లు తొలగించారు. దీంతో యాత్ర ఆరంభానికి రంగం సిద్ధమైంది.
- మధ్యాహ్నం 3 గంటలకు తొలి రథం బయల్దేరింది.
- తొలుత బలభద్రుని రథం తాళధ్వజం, తర్వాత దేవీ సుభద్ర రథం దర్పదళనం, వెంటే జగన్నాథుని నందిఘోష్ రథం కదలింది.
- బొడొదండొ మార్గంలో పిన్నమ్మ(మౌసీ మా) ఇంటి ముంగిట గుండా కదిలిన రథాలు.. గుండిచా మందిరం దిశలో సాయంత్రం 6.30 గంటల వరకు ముందుకు కదిలాయి.

సైడ్ లైట్స్..

- యాత్ర కోసం మూల విరాట్‌లు రథాలపై ఆసీనులు కావడంతో అనుబంధ ఉత్సవ మూర్తులను చెంతకు చేర్చారు.
- మేళతాళాలు, బాజాభజంత్రీలతో ప్రధాన ఆలయం నుంచి సేవాయత్ వర్గాలు మదన మోహనుడు, రామకృష్ణుల ఉత్సవ మూర్తులను రథాలపైకి తరలించారు.
- యాత్ర ప్రాంగణంలో యాత్రకు సిద్ధమైన రథాలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ భక్తిపూర్వకంగా నమస్కరించారు.
- స్థానిక గోవర్ధన పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి సంప్రదాయం ప్రకారం మూల విరాట్‌లను రథంపై తొలి దర్శనం చేసుకున్నారు. తన శిష్యులు, సేవకులతో కలిసి ఒక్కో రథంపై దేవుళ్లను దర్శించుకున్నారు.


మదన మోహనుని విజే


చారుమళ్లకు మోకరిల్లి నమస్కరిస్తున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్


జగన్నాథుని రథంపై జగద్గురు శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి


రథాలపై దేవుళ్లకు ప్రార్థిస్తున్న రాష్ట్ర గవర్నర్ గణేషీలాల్


నందిఘోష్ రథం లాగుతున్న సీఎం నవీన్ పట్నాయక్


రథయాత్ర సంచికను ఆవిష్కరిస్తున్న సీఎం, గవర్నర్, సీజే జస్టిస్ మురళీధర్


వైభవంగా జగన్నాథుని రథయాత్ర

విజయనగరం టౌన్: జగన్నాథుని రథయాత్ర మహోత్సవం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక సంతపేట జగన్నాథస్వామి ఆలయంలో కొలువైన స్వామివారికి మంగళవారం విశిష్ఠ పూజలు నిర్వహించారు. తోమాలమందిరం వద్ద పూజల అనంతరం కన్యకపరమేశ్వరి ఆలయం వద్ద భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. మన్నార్ రాజగోపాలస్వామి ఆలయం వద్ద ఆలయ ఈఓ బీఎల్.నగేష్ నేతృత్వంలో స్వామివారి రథాన్ని ఆలయం ఆవరణలో ఉంచారు. అనంతరం జగన్నాథపురంలోని గుండిచా మందిరం వద్దకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా స్వామికి పారిశ్రామిక బోర్డు డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు, కార్పొరేటర్‌లు మీసాల రమాదేవి, అల్లు చాణక్య, దాతలు ముచ్చు రామలింగస్వామి, బొడ్డు పండు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ డాక్టర్ మాటూరు సతీష్, ధర్మకర్తలు అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించి తరించారు. అదే విధంగా దాసన్నపేట, సంతపేట, మూడుకోవెళ్ల వద్ద నిర్వహించిన జగన్నాథస్వామి రథయాత్రను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.


పూజలందుకుంటున్న జగన్నాథుడు


జై జగన్నాథా అంటూ రథాన్ని లాగుతున్న పారిశ్రామిక బోర్డు డైరెక్టర్ బంగారునాయుడు, కార్పొరేటర్లు, భక్తులు

పుష్పాలంకరణలో పైడితల్లి


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో చండీయాగం నిర్వహించారు. అనంతరం యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అమ్మవారికి తీపిపదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తరించారు.


ఆలయంలో చండీ హోమం నిర్వహించిన అర్చకులు

బ్యాంక్ సేవలను సద్వినియోగంచేసుకోవాలి

- రీజనల్ మేనేజర్ రాఘవేంద్ర


పాస్‌బుక్ ప్రింటర్‌ను ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్ రాఘవేంద్ర

పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ద్వారా అందజేస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాఘవేంద్ర కోరారు. ఈ మేరకు పార్వతీపురం మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలోని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు శాఖ పరిధి తురకనాయుడు వలస గ్రామంలో బ్యాంకుమిత్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాస్‌బుక్ ప్రింటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బ్యాంకు సేవలను మరింత సులభతరం చేసేందుకు, ఖాతాదారుల సౌలభ్యం కోసం ఆయా గ్రామాల్లో సీఎస్‌పీలను ఏర్పాటు చేశామన్నారు. తోటపల్లి ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ గంట శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇక నుంచి సీఎస్పీల వద్ద ఏర్పాటు చేసిన ప్రింటర్ ద్వారా పాస్‌బుక్ అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ వాసు, డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో షూటింగ్ సందడి


వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహిస్తున్న షూటింగ్

విజయనగరం టౌన్: శ్రీ లలితాంబిక ప్రొడక్షన్స్ బ్యానర్‌లో అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న నూతన చిత్రం షూటింగ్‌ను విజయనగరంలోని గంటస్తంభం, కోట, మహారాజా కళాశాల తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం షూటింగ్ సందడి నెలకొంది. మహేష్ బాబు మేనల్లుడు గల్లా అశోక్ హీరోగా రెండో చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి సోమినేని బాలకృష్ణ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు


పిడుగుపడి కాలిపోతున్న కొబ్బరిచెట్టు

శృంగవరపుకోట: ఎస్.కోట-విశాఖ అరకు ప్రధాన రహదారిలో పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న కొబ్బరిచెట్టుపై మంగళవారం రాత్రి 8గంటల సమయంలో పిడుగుపడి మంటలు రేగాయి. దీంతో పచ్చటి కొబ్బరి చెట్టు మొవ్వు భగభగ కాలడంతో రోడ్డున పోతున్న వారంతా నిశ్చేష్టులై చూశారు. సమీపంలోని అగ్నిమాపక శాఖ సిబ్బందికి విషయం తెలియజేయగా హుటాహుటిన వారు వచ్చి మంటలు ఆర్పారు.

భర్త కొట్టాడని ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: భర్త కొట్టాడని మనస్తాపం చెందిన భార్య ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కురుపాం మండలం చీడిగూడ గ్రామానికి చెందిన తోయక సుశీలకు భర్త వెంకటరావుకు మధ్య పిల్లలను పాఠశాలకు పంపే విషయమై ఉదయం చిన్న గొడవ జరిగింది. ఈ గొడవలో భర్త వెంకటరావు, సుశీలపై చేయిచేసుకున్నాడు. దీంతో ఆమె మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న ఎలుకలమందు తాగేసింది. ఈ విషయం గమనించిన భర్త వెంకటరావు చికిత్సకోసం మొండెంఖల్ పీహెచ్‌సీకి తరలించాడు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రిలో చేర్పారు.

సీతం విద్యార్థినికి అవార్డు

- ప్రదానం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి

విజయనగరం అర్బన్: గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ నాలుగో సంవత్సరం చదువుతున్న అన్నా నేహా థామస్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలోని 'ఇన్సెన్షియల్ స్టూడెంట్ అవార్డు-2023కు ఎంపికైంది. ఈ అవార్డును మంగళవారం విజయవాడలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి ఆమెకు ప్రదానం చేశారు. ఈ మేరకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి మగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అన్నా నేహాథామస్ చదువుతోపాటు శాస్త్రీయ నృత్యంలోనూ అలాగే ఎన్‌సీసీ విభాగంలో ప్రతిభ కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 26న ఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిక్ డే ఎన్‌సీసీ పరేడ్‌లో ఆమె పాల్గొందని విద్యార్థులంతా ఆమెను ఆదర్శంగా తీసుకున్ని అన్ని రంగాల్లో వృద్ధిచెందాలని కోరారు. అన్నా నేహథామస్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు అభినందించారు.


సీఎం జగన్‌మోహన్ రెడ్డి నుంచి అభినందనలు అందుకుంటున్న అన్నా నేహథామస్

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీ

- జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్

పార్వతీపురంటౌన్: ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించామని జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ తెలిపారు. ఈ మేరకు వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ల నేతృత్వంలో రెండు బృందాలు ఏర్పాటు చేసి పట్టణంలో ఉన్న పలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రూ.15.45 లక్షల స్టాక్స్‌ను సీజ్ చేశామన్నారు. స్టాక్ రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడం, రైతులకు బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు చేపట్టడం, నిల్వలు-ధరల పట్టికను ప్రదర్శించకపోవడం, అధీకృత తయారీదారుల నుంచి కొనుగోలు చేసిన ఇన్వాయిస్-సోర్స్ సర్టిఫికెట్స్ నివేదించలేకపోవడం తదితర ఉల్లంఘనలను గుర్తించినట్లు చెప్పారు. సంబంధిత డీలర్లపై నిత్యావసర నిల్వల చట్టం (ఈసీ యాక్ట్) 1955, విత్తన చట్టం 1966 -పురుగుమందుల చట్టం 1968 ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రీసర్వేలో లక్ష్యాలు అధిగమించాలి

- కలెక్టర్ నాగలక్ష్మి

పూసపాటిరేగ: నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, జూలై నెలాఖరు నాటికి రెండో దశ పనులను పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వే, రెవెన్యూ విభాగ అధికారులతో సమావేశమయ్యారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సంబంధిత డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. సాంకేతిక సమస్యను అధిగమించి నిర్ణీతగడువులోగా రెండోదశ రీసర్వే పూర్తి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆమె కంప్యూటర్‌లో లాగిన్ అయి రెండో దశలో భాగంగా పూసపాటిరేగ మండలంలో రీసర్వే జరుగుతున్న 11 గ్రామాల తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. ఫలితాలు తక్కువగా ఉన్న గ్రామాల్లో వేగం పెంచాలని అవసరమైతే అదనపు సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. మొదటి దశలో సర్వే పూర్తయిన కృష్ణాపురంలో ఇబ్బందులు తలెత్తాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మరోసారి పరిశీలించి చక్కదిద్దాలని సలహా ఇచ్చారు. రీసర్వే పూర్తిచేసుకున్న గ్రామాలలో రైతుల పాస్‌పుస్తకాలకు ఆధార్ అనుసంధానం చేయాలని సూచించారు. అలాగే ఎల్‌పీఎం నంబర్ ఆధారంగా మ్యుటేషన్ చేయాలని కలెక్టర్ నిర్దేశించారు. ఆటో అప్‌డేషన్ అయ్యే విధంగా వివరాలు పొందుపరచాలని సూచించారు. ఆమెతోపాటు విజయనగరం ఆర్‌డీఓ సూర్యకళ, సర్వే విభాగపు ఎ.డి త్రివిక్రమరావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, మండల సర్వేయర్ గణపతిరావుతో పాటు గ్రామసర్వేయర్లు, వీఆర్‌ఓలు సమావేశంలో పాల్గొన్నారు.


రీసర్వేపై అధికారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

పార్వతీపురం/కొమరాడ: అవసాన దశలో ఆదుకుంటాడనుకున్న కుమారుడు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. గుర్తు తెలియని వాహనం ఢీకొని కుమారుడు మృతి చెందడంతో కంటికిమింటికి ఏకధారగా రోదిస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం కోటిపాం గ్రామానికి చెందిన వై.భీమయ్య, పద్మ దంపతుల కుమారుడు ధర్మారావు(27)బీటెక్ చదివి విశాఖపట్నంలోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగంచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉద్యోగ రీత్యా విశాఖపట్నంలో ఉంటున్న ఆ యువకుడు మూడు రోజుల క్రితం తల్లిదండ్రులను చూసేందుకు కోటిపాం వచ్చాడు. మంగళవారం ఉదయం తిరిగి విశాఖపట్నం వెళ్లిపోయేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. ఈ క్రమంలో పార్వతీపురం సమీప మరిపివలస సమీపంలో కొద్దిపాటి వర్షం కురుస్తున్న సమయంలో గుర్తు తెలియని భారీ వాహనం బైక్‌ను ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయాడు. దీంతో ఆ వాహనం ధర్మారావును ఈడ్చుకు పోవడంతో శరీరం నుజ్జునుజ్జయింది. ప్రమాద సమాచారం మేరకు పార్వతీపురం రూరల్ ఎస్సై వై.సింహచలం సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి డిగ్రీ చదువుతున్న చెల్లి ఉంది.


ధర్మారావు(ఫైల్)

రైలు ఢీకొని వృద్ధుడు..

పార్వతీపురం: మండలంలోని నర్సిపురం గ్రామానికి చెందిన కోట శ్రీరాములు(66) ఇంటినుంచి పొలానికి వెళ్తూ రైల్వేట్రాక్ దాటుతున్న సమయంలో సీతానగరంనుంచి పార్వతీపురంవైపు వెళ్తున్న రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీరాములు మృతదేహం నుజ్జునుజ్జయింది. ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్సై రవివర్మ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.